సాక్షి
చిత్తూరు
శనివారం। 23। సెప్టెంబర్। 2023



వరసిద్ధుడికి వి'శేష' సేవలు

కాణిపాకం వినాయకస్వామివారి బ్రహ్మోత్సవా ల్లో భాగంగా శుక్రవారం స్వామివారు చిన్న పెద్ద శేషవాహనాలపై విహరించారు. - 8లో




పకడ్బందీగా రేషనలైజేషన్

జిల్లాలో పోలింగ్ స్టేషన్‌ల రేషనలైజేషన్ ప్రక్రియ పకడ్బందీగా చేపడుతున్నట్లు జిల్లా కలెక్టర్ షణ్మోహన్ తెలిపారు. - 8లో

	గరిష్టం	కనిష్టం
చిత్తూరు	34	24
తిరుపతి	33	24
తిరుమల	29	20
గూడూరు	36	26
నగరి	35	25

న్యూస్‌రీల్

భక్తిశ్రద్ధలతో రాహుకాల అభిషేక పూజలు



విశేషాలంకరణలో బోయకొండ గంగమ్మ

చౌడేపల్లె: మండలంలోని బోయకొండ గంగమ్మ ఆలయంలో అమ్మవారికి శుక్రవారం రాహుకాల అభిషేక పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వేకువజామున ఆలయ అర్చకులు అమ్మవారిని మేల్కొలిపి, గర్భాలయాన్ని శుద్ధి చేశారు. రాహుకాల సమయం 10.30 నుంచి 12 గంటల మధ్య సంప్రదాబద్ధంగా అర్చనలు, అభిషేక పూజలు నిర్వహించారు. అనంతరం పసిడి ఆభరణాలు, సుగంధభరిత పుష్పాలతో అమ్మవారికి విశేషాలంకరణ చేసి, భక్తులకు దర్శనం కల్పించారు. అభిషేక పూజల్లో 125 మంది దంపతులు పాల్గొన్నారు. ఈఓ చంద్రమౌళి ఆధ్వర్యంలో వారికి తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

జిల్లాకు చేరిన లైబ్రరీ పుస్తకాలు



లారీ నుంచి పుస్తకాలు దించుతున్న సిబ్బంది

చిత్తూరు కలెక్టరేట్ : రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలకు పంపిణీ చేసే లైబ్రరీ పుస్తకాలు జిల్లాకు చేరాయని సమగ్రశిక్ష శాఖ సీఎంఓ ఉదయలక్ష్మి వెల్లడించారు. శుక్రవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ జిల్లాకు వచ్చిన లైబ్రరీ పుస్తకాలను జిల్లా కేంద్రంలోని బాలాజీ కాలనీ మున్సిపల్ పాఠశాలలో భద్రపరిచినట్లు తెలిపారు. జిల్లాలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలకు 2,136 సెట్ల పుస్తకాలు వచ్చినట్లు చెప్పారు. తరువాత ఉన్నత పాఠశాలలకు పుస్తకాలు వస్తాయన్నారు. అనంతరం వాటిని ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలలకు సరఫరా చేస్తామని చెప్పారు.

పకడ్బందీగా స్వచ్ఛతా హి సేవ



సమగ్రశిక్ష ఏపీసీ వెంకటరమణారెడ్డి

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో స్వచ్ఛతా హి సేవ కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని సమగ్రశిక్ష శాఖ ఏపీసీ వెంకటరమణారెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో ఈనెల 15 నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు స్వచ్ఛతా హి సేవ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రతి రోజూ నిర్వహించే కార్యక్రమాల ఫొటోలు, వీడియోలు జిల్లా సమగ్రశిక్ష వాట్సాప్ గ్రూప్‌లో తప్పనిసరిగా పోస్ట్ చేయాలన్నారు. విద్యార్థులకు స్వచ్ఛతా హి సేవా కార్యక్రమం ముఖ్య ఉద్దేశాన్ని ఉపాధ్యాయులు తెలియజేయాలని ఏపీసీ ఆదేశించారు.

సాంస్కృతిక వేడుకల్లో టీటీడీ చైర్మన్ భూమన, ఈఓ



మోహినీ అలంకరణలో..



తిరుచ్చిపై శ్రీకృష్ణుడు



కళాకారులతో మంత్రి ఆర్కే రోజా





గరుడ గోవిందం

ఇల వైకుంఠంగా విరాజిల్లుతున్న తిరుమలకు భక్తులు పోటెత్తారు. శుక్రవారం రాత్రి జరిగిన గరుడ సేవకు తండోపతండాలుగా తరలివచ్చారు. పక్షిరాజుపై విహరిస్తున్న పరమాత్ముడిని దర్శించి పునీతులయ్యారు. కర్పూర హారతులు సమర్పించి ఆధ్యాత్మికానందంలో మునిగితేలారు. ఉదయం జగద్రక్షకుడైన శ్రీ వేంకటేశ్వరుడు మోహినీ రూపంలో దంత పల్లకీపై శృంగార సారథి దేవతగా, పక్కనే వెన్న ముద్ద చేతబట్టిన చిన్నికృష్ణుడితో కలిసి హోయలొలుకుతూ భక్తకోటిని అనుగ్రహించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి, ఈఓ ఏవీ.ధర్మారెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

- గరుడ సేవకు పోటెత్తిన భక్తులు
- కిక్కిరిసిన తిరుమాడ వీధులు
- ఏర్పాట్లు పర్యవేక్షించిన టీటీడీ చైర్మన్, ఈఓ

తిరుమల: తిరుమల శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. ఐదో రోజు శుక్రవారం రాత్రి గరుడ వాహనంపై విహరిస్తూ మలయప్ప భక్తులను సాక్షాత్కరించారు. ఉత్సవమూర్తిని ప్రతి ఒక్కరూ దర్శించుకునేలా వాహనాన్ని అటూఇటూ తిప్పుతూ భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. భక్తులు అధికంగా నిరీక్షించే ప్రాంతాల్లో హారతులతో కూడిన దర్శనం కల్పించారు. కూడళ్లలో ఎక్కువ సమయం వాహనాన్ని నిలిపి సాధ్యమైనంత ఎక్కువ మంది భక్తులకు దర్శనం కల్పించటంలో టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి, ఈఓ ధర్మారెడ్డి, ఎస్పీ పరమేశ్వరరెడ్డి సఫలీకృతులయ్యారు. ఉదయం మలయప్ప స్వామి మోహినీ రూపంలో దంత పల్లకీపై ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. గరుడ వాహన సేవను చూసి తరించడానికి భక్తులు ఉదయం నుంచే పెద్ద ఎత్తున తరలివచ్చారు. గ్యాలరీల్లో వేచి ఉన్న భక్తులకు జలప్రసాదం, పులిహోర, ఉప్మా, సాంబరన్నం, ఇతర అన్నప్రసాదాల ప్యాకెట్లు, పాలు, తేనీరు సరఫరా చేశారు. పారిశుద్ధ్యంపై ఆరోగ్యశాఖ ప్రత్యేక దృష్టికనబరిచింది. ఎస్పీ పరమేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేశారు.



నమస్కరిస్తున్న టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి



జయ కృష్ణా ముకుందా మురారి



కళా బ్రహ్మోత్సవం



కరెన్సీ వినాయకుడు

- రూ.20 లక్షల నోట్లతో గణపయ్యకు అలంకరణ

పలమనేరు: పట్టణంలోని చిన్నగాండ్లవీధిలో ఏర్పాటు చేసిన వినాయక స్వామివారికి విశేషంగా పూజలు సాగుతున్నాయి. ఈ నేపథ్యంలో నిర్వాహకులు ఐదో రోజైన శుక్రవారం స్వామివారి విగ్రహం చుట్టూ రూ. 20 లక్షల కరెన్సీ నోట్లతో అలంకరించారు. ఇలా ఐదు రోజులుగా వివిధ రకాల అలంకరణలో వినాయకస్వామివారు భక్తులను కటాక్షిస్తున్నారు.



25 నుంచి పవిత్రోత్సవాలు



నగలు సరిచూస్తున్న ఈఓ సాగర్‌బాబు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఈ నెల 25 నుంచి పవిత్రోత్సవాలు ప్రారంభం కానున్నట్లు ఈఓ సాగర్‌బా బు తెలిపారు. ఈ సందర్భంగా గురువారం బ్యాంకు లాకర్‌లో భద్రపరిచిన స్వామి, అమ్మవార్ల నగలను బయటకు తీసి పరిశీలించారు. ఉత్సవాల అనంత రం తిరిగి లాకర్‌లో భద్రపరచనున్నట్లు తెలిపారు.

25న అతిథి అధ్యాపకులకు ఇంటర్వ్యూలు

పుత్తూరు రూరల్: స్థానిక ఎస్‌ఆర్‌ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తాత్కాలిక ప్రాతిపదికన కంప్యూటర్ సైన్స్, తమిళం సబ్జెక్టులు బోధించేందుకు ఈనెల 25న అతిథి అధ్యాపకులకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ జీ.శ్రీనివాసులురెడ్డి తెలిపారు. కంప్యూటర్ సైన్స్ అధ్యాపకులు ఎంఎస్సీ, ఎంసీఏ, ఎంటెక్‌లతో పాటు యూజీసీ నెట్, ఏపీసెట్, పీహెచ్‌డీ, తమిళ అధ్యాపకులు ఎంఏ (తమిళం)తో పాటు యూజీసీ నెట్, ఏపీసెట్, పీ హెచ్‌డీ డిగ్రీలు కలిగి ఉండాలన్నారు. వివరాలకు 81425 38870 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

వినాయకుని సేవలో తెలంగాణ మంత్రి


తెలంగాణ మంత్రి మల్లారెడ్డి కుటుంబ సభ్యులకు స్వామివారి చిత్రపటం అందజేస్తున్న ఈఓ వెంకటేశు

కాణిపాకం (యాదమరి): శ్రీవరసిద్ధి వినాయక స్వామివారిని తెలంగాణ కార్మిక శాఖ మంత్రి మల్లారెడ్డి శుక్రవారం దర్శించుకున్నారు. మధ్యాహ్నం ఆయన స్వామివారి దర్శనార్థం కుటుంబ సమేతంగా విచ్చేయగా ఆలయ ఈఓ వెంకటేశు స్వాగతం పలికి స్వామివారి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేపట్టారు. అనంతరం ఆశీర్వాద మండపంలో వేదపండితులు ఆయనకు ఆశీర్వచనం పలికి, స్వామివారి చిత్రపటం, తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఏఈఓ ఎస్వీ కృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పత్రికా ప్రకటన

వర్షాధార ప్రాంత అభివృద్ధి పథకము వార్షిక కార్యాచరణ 2022-23 ప్రణాళిక అమలు :
2014-15లో నేషనల్ మిషన్ ఫర్ సస్టైయినబుల్ అగ్రికల్చర్ (NMSA) క్రింద, వర్షాధార ప్రాంత అభివృద్ధి (RAD) కాంపోనెంట్ క్రింద వ్యవసాయ శాఖ కు 2022-23లో ఆమోదించబడిన కార్యాచరణ ప్రణాళికలో 25 నెం. ప్రాసెసింగ్ యూనిట్లు రూ. 50.00 లక్షల రాయితీ క్రింద మన చిత్తూరు జిల్లాకు మంజూరు చేయడం జరిగింది.
ప్రాసెసింగ్ యూనిట్లకు సంబంధించిన పరికరాల వివరములు:
A) చిరుధాన్యాల సూర్పిడి యంత్రాలు: డిస్టోనర్ కమ్ గ్రేడర్ కమ్ డస్ట్ ఆస్పిరేటర్, డీహస్కర్/డీహల్లర్, పాలిషర్, పేల్లర్ (రాగి కొరకు), పల్వెరైజర్/మిల్లర్, మినిలెట్ మిల్/ఫ్లోర్ మిల్
B) పప్పుదినుసుల సూర్పిడి యంత్రాలు: డిస్టోనర్ కమ్ గ్రేడర్ కమ్ డస్ట్ ఆస్పిరేటర్, మినీ దాల్ మిల్స్, దాల్ ఆయిల్ మిక్సర్, రోస్టర్, డబల్ స్టిచ్ బ్యాగ్ క్లోజర్ .
C) వేరుశనగ సూర్పిడి యంత్రాలు : ప్రీ క్లీనర్ ఫర్ గ్రౌండ్ నట్ కెర్నల్, హ్యాండ్ ఆపరేటేడ్ గ్రౌండ్ నట్ డీకోర్టికేటర్, గ్రౌండ్ నట్ డీ కోర్టికేటర్ విత్ అవుట్ గ్రేడర్, గ్రౌండ్ నట్ ఆయిల్ ఎక్స్పెల్లర్, గ్రౌండ్ నట్ ఆయిల్ ఫిల్టర్ ప్రెస్, బాటిల్ ఫిల్లింగ్ మెషీన్ (ఆయిల్), టేబల్ టాప్ ఆయిల్ ఎక్స్పెల్లర్, గ్రౌండ్ నట్ త్రెషర్, పవర్ ఆపరేటేడ్ గ్రౌండ్ నట్ ప్రుయిపర్. చిత్తూరు జిల్లాకు మంజూరు చేయడం జరిగింది.
ఈ పై తెలిపిన యంత్రాలకు సంబంధించిన సంస్థలు /అధీకృత డీలర్లు జిల్లా కొనుగోలు కమిటీ ముందు పాల్గొని ఎంపానెల్మెంట్ మరియు యంత్రాల ధర ఖరారు చేసుకోవాల్సిందిగా కోరుచున్నాము తద్వారా ఎంపానెల్మెంట్ కొరకు దరఖాస్తు చేసుకోవాలనుకున్న సంస్థలు/అధీకృత డీలర్లు **తేదీ: 26.09.2023** లోగా జిల్లా వ్యవసాయ అధికారి వారి కార్యాలయము, చిత్తూరు, పి. వి .కె. యన్ కాలేజీ వెనుక నందు సంప్రదించి దరఖాస్తు చేసుకోవలసిందిగా కోరడమైనది. సంప్రదించండి : 8331057739.
జిల్లా వ్యవసాయ అధికారి, చిత్తూరు/ జాయింట్ కలెక్టర్, చిత్తూరు

గజగమనా.. గరిక ప్రియా.. ఉమాతనయా.. ఏక దంతా.. వక్రతుండా.. వర అభయా.. వీర విఘ్నేశా.. మా హారతులందుకో.. మమ్ము కరుణించు.. కరివదనా.. అని భక్తులు వరసిద్ధుడిని చిన్న, పెద్ద శేషవాహన సేవల్లో భక్తిశ్రద్ధలతో కొలిచారు.

వరసిద్ధుడికి విశేష సేవలు



శత క్షీర కలశాల ఊరేగింపులో పాల్గొన్న భక్తులు, చిన్న శేషవాహనంపై వరసిద్ధి వినాయకస్వామివారు

కాణిపాకం(యాదమరి): కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం సిద్ధి, బుద్ధి, సమేత వరసిద్ధుడు చిన్న, పెద్ద శేషవాహనాలపై విహరిస్తూ భక్తులను కటాక్షించారు. వేకువజామున మూలవిరాట్‌కు ఆలయ అర్చకులు ప్రత్యేక అభిషేకం, అలంకరణ, అర్చన, ప్రత్యేక పూజలు చేసి, భక్తులకు దర్శనం కల్పించారు. ప్రధాన ఆలయం, స్వర్ణ ధ్వజస్తంభం, సుపథ మండపాన్ని సుగంధభరిత పుష్పాలతో శోభయమానంగా అలంకరించారు. అనంతరం ఉభయకర్తల ఆధ్వర్యంలో మూలవిరాట్‌కు అభిషేకం, అలంకరణ, పూజలు నిర్వహించి, ఉభయకర్తలకు ప్రత్యేక దర్శనం కల్పించారు. అలంకార మండపంలో సిద్ధి, బుద్ధి సమేత గౌరీ సుతునికి విశేషాలంకరణ చేసి, చిన్న శేష వాహనంలో కొలువుదీర్చారు. మేళతాళాలు, కళాకారుల సాంస్కృతిక ప్రదర్శనల నడుమ పురవీధుల్లో వాహనసేవ జరిపారు.

కనుల పండువగా పెద్ద శేషవాహనం

రాత్రి అలంకార మండపంలో అర్చకులు సిద్ధి, బుద్ధి సమేత వినాయకస్వామివారికి సుగంధభరిత పుష్పాలతో అలంకరించి పూజలు చేశారు. ఉభయకర్తలు, ఆలయ అధికారులు ఉత్సవమూర్తులను ఊరేగింపుగా తీసుకొచ్చి బంగారు పెద్ద శేష వాహనంలో కొలువుతీర్చారు. ప్రత్యేక పూజల అనంతరం మంగళ వాయిద్యాలు, కోలాటాలు, చెక్క భజనల నడుమ పెద్దశేష వాహన సేవ నిర్వహించారు. పూజలకు కాణిపాకం, కాకర్ల వారిపల్లె, వడ్రాంపల్లె, మిట్టఇండ్లు, కొత్తపల్లె, అడపగుండ్లపల్లె, బొమ్మసముద్రం, తిమ్మోజిపల్లె, తిరువణంపల్లె, చిగరపల్లె, అగరంపల్లెకు చెందిన కమ్మ సామాజిక వర్గీయులు ఉభయకర్తలుగా వ్యవహరించారు.

వైభవం.. శత కలశ క్షీరాభిషేకం

కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామివారికి ఉభయకర్తల ఆధ్వర్యంలో శత కలశ క్షీరాభిషేకం వైభవంగా నిర్వహించారు. ఉదయం స్వామివారి అనుబంధ ఆలయం నుంచి ఉభయకర్తలు, వారి కుటుంబసభ్యులు శత క్షీర కలశాలను మేళతాళాలు, కేరళ వాయిద్యాల నడుమ ఊరేగింపుగా తీసుకువచ్చారు. ఆలయ కల్యాణ వేదికలో కొలువుదీర్చిన సిద్ధి, బుద్ధి, సమేత వినాయక స్వామివారి విగ్రహాలకు ఆలయ అర్చకులు శేఖర్ స్వామి ఆధ్వర్యంలో క్షీర, గంధ, పంచామృత అభిషేకాలు నిర్వహించి, పూజలు చే శారు. ఈ కార్యక్రమాల్లో ఆలయ చైర్మన్ మోహన్‌రెడ్డి, ఈఓ వెంకటేశు, సర్పంచ్ శాంతిసాగర్ రెడ్డి, ఆలయ మాజీ చైర్మన్ మణి నాయుడు, మాజీ సర్పంచ్ మధుసూదన్, ఏఈఓ ఎస్వీ కృష్ణారెడ్డి, సూపరింటెండెంట్ కోదండపాణి, ఇన్‌స్పెక్టర్ బాబు పాల్గొన్నారు.

నేడు వృషభ వాహన సేవ

కాణిపాకం బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి స్వామివారు వృషభవాహనంలో ఊరేగనున్నారు. ఉదయం స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, అలంకరణ, అర్చన, పూజలు నిర్వహించనున్నారు.


పెద్ద శేషవాహనంపై స్వామివారు

నిందితుడి అరెస్టు


నిందితుడి అరెస్టు చూపుతున్న చిత్తూరు క్రైమ్ పోలీసులు

చిత్తూరుఅర్బన్: చోరీలు, దోపిడీ కేసుల్లో నిందితుడిగా ఉంటూ కోర్టుకు హాజరుకాకుండా ఏడేళ్లుగా తప్పించుకుని తి రుగుతున్న తొండ మొగలాల (47) అనే వ్యక్తిని చిత్తూరు క్రైమ్ పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. చిత్తూరులో జ రిగిన పలు చోరీ కేసులతో పాటు తిరుప తి, మదనపల్లె, నెల్లూరు, నాయుడుపేట పోలీస్ స్టేషన్లలో మొగలాలపై కేసులున్నాయి. అయితే చిత్తూరు కేసులో కోర్టుకు హాజరు కాకపోవడంతో ఇతనిపై నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ చేస్తూ ఇటీవల కోర్టు ఆదేశాలు జారీ చేసింది. పశ్చిమ గోదావరి జిల్లా గోకవరంలో ఉన్న నిందితుడు మొగలాలను క్రైమ్ సీఐ భాస్కర్ అదుపులోకి తీసుకున్నారు. నిందితుడిని చిత్తూరులోని ప్రిన్స్‌పల్ అసిస్టెంట్ సెషన్ కోర్టు ఎదుట హాజరుపరచగా 14 రిమాండు విధిస్తూ న్యాయస్థానం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ఇతడిని చిత్తూరులోని జిల్లా జైలుకు తరలించారు.

బ్యాటరీ దొంగకు జైలు


షణ్మగం

బంగారుపాళెం: ఏటీఎంలో బ్యాటరీల చోరీ కేసుకు సంబంధించి నిందితునికి ప్రిన్సిపల్ సివిల్ సెషన్ జడ్జి ఉమాదేవి జైలుశిక్ష విధించినట్లు శుక్రవారం సీఐ నాగరాజరావు తెలిపారు. మండలంలోని కుప్పాలగుర్రప్పసత్రం(కేజీసత్రం) స్టేట్ బ్యాంక్ ఏటీఎంలో 2022లో బ్యాటరీలు చోరీ జరిగాయన్నారు. ఈ కేసుకు సంబంధించి తిరుపతికి చెందిన షణ్మగంను అరెస్టు చేసి కోర్టులో హాజరు పరచినట్లు తెలిపారు. నిందితుడికి 15 నెలలు జైలుశిక్ష విధిస్తూ జడ్జి తీర్పు చెప్పారని తెలిపారు.

ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న కారు.. ఇద్దరి మృతి

- మరొకరికి తీవ్రగాయాలు
- దైవ దర్శనానికి వెళుతుండగా ప్రమాదం


సంఘటన స్థలంలో క్షతగాత్రుడు



వెంకటముని, నారాయణగౌడ్ మృతదేహాలు

బంగారుపాళెం: కాణిపాకం వినాయకస్వామి వారిని దర్శించుకునేందుకు వెళుతూ రోడ్డు ప్రమాదానికి గురై ఇద్దరు వ్యక్తులు మృతి చెందగా, మరో వ్యక్తి తీవ్రంగా గాయపడిన సంఘటన శుక్రవారం మొగిలి గ్రామం వద్ద చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికుల కథనం మేరకు.. బైరెడ్డిపల్లె మండలం రామనపల్లెకు చెందిన నారాయణగౌడ్(53), వెంకటముని(58), శ్రీరాములురెడ్డి(42) ద్విచక్రవాహనంపై కాణిపాకం వినాయక స్వామి దర్శనానికి బయలుదేరారు. మార్గమధ్యంలో మొగిలి గ్రామంలో మొగిలీశ్వరస్వామివారిని దర్శించుకుని, కాణిపాకం వెళ్లాలనుకున్నారు. ఈ క్రమంలో రోడ్డు దాటుతుండగా చిత్తూరు నుంచి పలమనేరుకు వెళుతున్న కారు ఢీ కొంది. ఈ ప్రమాదంలో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న హైవే పోలీసులు, 108 సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని, క్షతగాత్రులను బంగారుపాళెం ప్రభుత్వాస్పత్రికి తరలిస్తుండగా నారాయణగౌడ్, వెంకటముని మార్గ మధ్యంలో మృతి చెందారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం బంగారుపాళెం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. శ్రీరాములురెడ్డిని చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి సిఫార్సు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ నాగరాజరావు తెలిపారు.

జగనన్నకు చెబుదాంలో అన్ని సమస్యల పరిష్కారం


అర్జీలను పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు

గుడిపాల: జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో అన్ని సమస్యలకు పరిష్కారం లభిస్తుందని జిల్లా జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం గుడిపాల ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో జిల్లా, మండల స్థాయి అధికారులతో కలిసి నిర్వహించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారం నిమిత్తం మండలస్థాయిలో జరుగుతున్న జగనన్నకు చెబుదాం కార్యక్రమం అత్యంత ముఖ్యమైనదన్నారు. స్పందన కార్యక్రమాన్ని మరింత మెరుగు పరచి జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని ప్రభుత్వం నిర్వహిస్తుందన్నారు. ఇక్కడ వచ్చిన అర్జీల పరిష్కారానికి 15 రోజుల తరువాత మళ్లీ సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహిస్తామని చెప్పారు. కార్యక్రమంలో రెవెన్యూ సమస్యలు అధికంగా వస్తున్నాయని, ఈ సమస్యల పరిష్కారం కోసం తహసీల్దార్లు, సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి, సమస్యను అక్కడికక్కడే పరిష్కారించాలని, లేనిపక్షంలో అర్జీదారుని సమస్య పరిష్కరించకపోవడానికి గల కారణాలను సవివరంగా వివరించాలన్నారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమ ఆశయం నెరవేరేలా అధికారులందరూ పని చేయాలని జేసీ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మొత్తం 71 అర్జీలు రాగా వీటన్నింటినీ వెంటనే పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి, డీఆర్‌డీఏ డ్వామా పీడీలు తులసి, గంగాభవానీ, ఉద్యాన, పశుసంవర్ధకశాఖ అధికారులు మధుసూదన్‌రెడ్డి, ప్రభాకర్, ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ ఉమామహేశ్వర్‌రెడ్డి, పీఆర్ ఈఈ చంద్రశేఖర్‌రెడ్డి, డీపీఓ లక్ష్మి, డీఎల్‌డీఓ రవి కుమార్, నియోజకవర్గ ప్రత్యేకాధికారి రవికుమార్, ఎంపీపీ ప్రసాద్‌రెడ్డి, జెడ్పీవైస్ చైర్మన్ రమ్య, ఎంపీడీఓ రాజశేఖర్‌రెడ్డి, డీటీ కళ్యాణి పాల్గొన్నారు.

గజ రక్షణకు ప్రణాళికలు

- డీఎఫ్ఓ చైతన్యకుమార్‌రెడ్డి


మొగిలి వద్ద ఏనుగులు సంచరించే ప్రాంతాల మ్యాప్‌ను పరిశీలిస్తున్న డీఎఫ్ఓ చైతన్యకుమార్

బంగారుపాళెం: ఏనుగులు విద్యుత్ షాక్‌కు గురికాకుండా తగు చర్యలు తీసుకునేందుకు ప్రణాళికలు తయారు చేస్తున్నామని జిల్లా అటవీశాఖాధికారి చైతన్యకుమార్‌రెడ్డి తెలిపారు. బంగారుపాళెం మండలం కౌండిన్య అటవీ సరిహద్దుల్లో ఏనుగులు సంచరించే ప్రాంతాల్లో హాట్ స్పాట్లుగా ఉన్న మొగిలి, టేకుమంద, బండ్లదొడ్డి తదితర ప్రాంతాలను శుక్రవారం విద్యుత్‌శాఖ, అటవీశాఖ ఉన్నతాధికారులు ఉమ్మడి తనిఖీలు చేశారు. డీఎఫ్ఓ మాట్లాడుతూ మండలంలో తరచూ ఏనుగులు అటవీ సరిహద్దుల్లో పంటపొలాల మీదుగా సంచరించే క్రమంలో విద్యుత్‌షాక్‌కు గురై మృత్యువాత పడుతున్న విషయం తెలిసిందేనన్నారు. పలమనేరు అటవీ రేంజ్ పరిధిలో సుమారు 15 ఏనుగులకు పైగా విద్యుత్ షాక్‌తో మృతి చెందినట్లు తెలిపారు. బంగారుపాళెం మండలంలో మొగిలివారిపల్లె, టేకుమంద, కీరమంద, బండ్లదొడ్డి గ్రామాల్లో ఐదు ఏనుగులు మృతి చెందాయన్నారు. పంట పొలాల వద్ద రైతులు బావుల చుట్టూ గోడలు నిర్మించాలన్నారు. ఇటీవల మండలంలోని గాండ్లపల్లె వద్ద ఓ ఏనుగు బావిలో పడిన విషయాన్ని గుర్తు చేశారు. అలాగే పంట పొలాల వద్ద తక్కువ ఎత్తులో ఉన్న విద్యుత్ తీగలు, ట్రాన్స్‌ఫార్మర్ల ఎత్తు పెంచాలని విద్యుత్‌శాఖ అధికారుల దృష్టికి తీసుకు వెళ్లామన్నారు. స్పందించిన ట్రాన్స్‌కో ఎస్‌ఈ కృష్ణారెడ్డి మాట్లాడుతూ పంట పొలాల వద్ద తక్కువ ఎత్తులో ఉన్న విద్యుత్ తీగలు, ట్రాన్స్‌ఫార్మర్లను ఎత్తు పెంచేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో పలమనేరు ఫారెస్ట్ రేంజర్ శివన్న, డీఈ హరి, ఏడీ కొండయ్య, ఏఈలు, అటవీశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

పకడ్బందీగా పోలింగ్ కేంద్రాల రేషనలైజేషన్

- పోలింగ్ స్టేషన్ల మార్పులపై అభ్యంతరాల స్వీకరణ
- రాజకీయపార్టీల ప్రతినిధుల సమావేశంలో కలెక్టర్ షణ్మోహన్


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ షణ్మోహన్

చిత్తూరు కలెక్టరేట్ : ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లాలో పకడ్బందీగా పోలింగ్ స్టేషన్‌ల రేషనలైజేషన్ ప్రక్రియ చేపడుతున్నట్లు కలెక్టర్ షణ్మోహన్ తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 18 ఏళ్ల నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కుకు నమోదు చేసుకునేలా రాజకీయ పార్టీల ప్రతినిధులు కృషి చేయాలన్నారు.

పోలింగ్ కేంద్రాల రేషనలైజేషన్ ప్రక్రియను క్షేత్రస్థాయిలో పకడ్బందీగా చేపడుతున్నట్లు తెలిపారు. ఆయా రాజకీయపార్టీల ప్రతినిధుల నుంచి లిఖిత పూర్వకంగా దరఖాస్తులు తీసుకుని ఎన్నికల సంఘం నిబంధనల మేరకు పరిశీలించిన తర్వాత పోలింగ్ కేంద్రాలు మార్పులు చేస్తున్నట్లు చెప్పారు. జిల్లాలో 1,737 పోలింగ్ కేంద్రాలున్నాయని చెప్పారు. ఇందులో పోలింగ్ కేంద్రాల మార్పునకు 46, స్థలం మార్పునకు 22, నూతన పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు 27, తీసివేయడం, కలపడం కోసం 13 దరఖాస్తులు వచ్చాయన్నారు. ప్రస్తుతం పుంగనూరు నియోజకవర్గంలో 261, నగరిలో 226, గంగాధరనెల్లూరులో 255, చిత్తూరులో 223, పూతలపట్టులో 242, పలమనేరులో 287, కుప్పం నియోజకవర్గంలో 243 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయన్నారు. మార్పులు చేర్పులు గురించి త్వరలో నిర్ణయం తీసుకొనున్నట్లుగా తెలిపారు. ఎస్సీ, ఎస్టీ జనాభా ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో వారి కోరిక మేరకు నూతన పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. గుర్తింపు పొందిన రాజకీయపార్టీల ప్రతినిధుల నుంచి వచ్చిన అభ్యంతరాలను పరిశీలించి పరిష్కరించిన తర్వాత రాష్ట్ర ఎన్నికల సంఘానికి నివేదికలు పంపుతామన్నారు. ఈ సమావేశంలో డీఆర్వో రాజశేఖర్, జెడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ భవానీ, ఆర్డీఓలు రేణుక, సుజన, శివయ్య, రాజకీయ పార్టీల ప్రతినిధులు గంగరాజు, నాగరాజన్, ఉదయ్ కుమార్, మధుకుమార్, విజయకుమార్, రాజసింహులు, సురేంద్రకుమార్, చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షను పకడ్బందీగా నిర్వహించండి

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఆరోగ్య సురక్ష క్యాంపులను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ షణ్మోహన్ ఆదేశించారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహణపై విజయవాడ నుంచి రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు, ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ జే.నివాస్ కలసి కలెక్టర్, వైద్య ఆరోగ్యశాఖ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అనంతరం జిల్లా అధికారులతో కలెక్టర్ మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. క్యాంప్‌లు నిర్వహించే తేదీలు, ప్రాంతాలను ముందస్తుగా ఆయా ప్రాంతాల ప్రజలకు తెలియజేయాలన్నారు. డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ ప్రభావతి మాట్లాడుతూ జిల్లాలో మొత్తం 464 హెల్త్‌సెంటర్లు, 14 అర్బన్ హెల్త్ సెంటర్లు ఉన్నాయన్నారు. మొత్తం 478 క్యాంపులను జిల్లాలో నిర్వహించేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. ఈ సమావేశంలో జిల్లా టీబీ నివారణ అధికారి వెంకటప్రసాద్, డీఐఓ రవిరాజు, డీపీఎంఓ హర్షవర్ధన్, పీఓ ఆర్‌బీఎస్‌కే సుదర్శన్, డీఎంఓ శ్రీనివాసులు పాల్గొన్నారు.

నాడు-నేడు పనులు వేగవంతం

జిల్లా వ్యాప్తంగా రెండో విడత నాడు-నేడు పనులను వేగవంతంగా చేయాలని కలెక్టర్ షణ్మోహన్ విద్యాశాఖ, ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో అదనపు తరగతుల గదులు నిర్మాణాలకు నిధుల కొరత లేదన్నారు. నాడు-నేడు పనుల పురోగతి, బిల్లులను మూడు రోజుల్లో అప్‌లోడ్‌చేయాలన్నారు. జిల్లాలో 1,200 మంది బడి ఈడు పిల్లలను బడిలో చేర్పించేందుకు చర్యలు చేపట్టాలని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో డీఈఓ విజయేంద్రరావు, సమగ్ర శిక్ష ఏపీసీ పెద్దిరెడ్డి వెంకటరమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.